సాక్షి
అనకాపల్లి
శనివారం । 18 । అక్టోబర్ । 2025

పల్లె పండగ.. బిల్లులకు నిరీక్షణ

- జిల్లాలో రావాల్సిన మొత్తం రూ.130 కోట్ల పైనే
- ఏడాది కాలంగా బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు
- మరోవైపు రెండో విడత 'పల్లె పండగ'కు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- బిల్లులు రాకపోవడంతో కొన్ని చోట్ల ఆగిన పనులు

సాక్షి, అనకాపల్లి:

తొలి విడత 'పల్లె పండగ' బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నారు. గతేడాది అక్టోబర్‌లో తలపెట్టిన పల్లె పండగ పనులకు సంబంధించి బిల్లులు ఇప్పటికీ విడుదల కాలేదు. తాజాగా రెండో విడత పల్లె పండగ పనులకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండడం కాంట్రాక్టర్లకు మింగుడు పడడం లేదు. జిల్లాలో తొలి విడతలో చేపట్టిన పనుల బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. దీంతో సగం పనులు చేసిన కాంట్రాక్టర్లు ఆ నిధులు ఎప్పుడొస్తాయా? అని కళ్లు కాయలు కాసేలా నిరీక్షిస్తున్నారు. గతేడాది అక్టోబర్ 14వ తేదీ నుంచి 'పల్లె పండగ'పేరిట గ్రామాల్లో సభలు నిర్వహించి సీసీ రోడ్లు, కాలువలు, ఇతర నిర్మాణాలను చేపట్టేందుకు వినతులు స్వీకరించారు. తొలి విడతలో పూర్తయిన పనుల బిల్లులు అధికారులు అప్‌లోడ్ చేశారు. నెలలు గడుస్తున్నా నిధులు విడుదల కాలేదు. కొన్ని చోట్ల కాంట్రాక్టర్లు అసంపూర్తిగానే పనులు నిలిపివేశారు.

రూ.11 కోట్లు మాత్రమే విడుదల

జిల్లాలో 166 కిలోమీటర్ల పొడవున 1,354 రోడ్ల నిర్మాణ పనులకు రూ.143 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేశారు. ఇంత వరకు రూ.11 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ.132 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గత సంవత్సరం నవంబరు నుంచి 'పల్లె పండగ' పేరుతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, రోడ్లు మరమ్మతులు వంటి నిర్మాణ పనులు మొదలయ్యాయి.

ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద 189 కిలోమీటర్ల పొడవు గల 1,734 రోడ్ల నిర్మాణ పనులు మంజూరయ్యాయి. పంచాయతీ రాజ్ ఇంజినీర్ల పర్యవేక్షణలో ఈ పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కాబట్టి బిల్లులు త్వరగా మంజూరవుతాయన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్లు పోటీపడి మరీ గ్రామాల్లో పనులు చేపట్టారు. ఫిబ్రవరి 15వ తేదీ నాటికి జిల్లాలో 166 కిలోమీటర్ల పరిధిలో 1,354 రోడ్ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. వీటికి సంబంధించి రూ.143 కోట్లు విడుదల చేయాలంటూ ఉపాధి హామీ పథకం వెబ్‌సైట్‌లో బిల్లులు అప్‌లోడ్ చేశారు. మార్చి నెలాఖరు నాటికి నిధులు విడుదల కావాల్సి ఉంది. కానీ అక్టోబర్ నెల కూడా వచ్చేసింది. ఇంకా నిధులు విడుదల కాలేకపోవడంతో కాంట్రాక్టర్ మిగిలిన పనులు నిలిపివేశారు. పనులు పూర్తి చేయాలని సంబంధిత ఉన్నతాధికారులు వేడుకుంటున్నా బిల్లులు విడుదలైతేనే పనులు చేపడతామని కరాఖండిగా కాంట్రాక్టర్లు చెప్పేశారు.

ముఖం చాటేసిన కాంట్రాక్టర్లు

కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు 'పల్లె పండగ' పనులు చేయడానికి పోటీ పడ్డారు. బిల్లులు రాకపోవడంతో మిగిలిన పనులు పూర్తి చేయకుండా కాంట్రాకర్లు ముఖం చాటేశారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రి, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పెండింగ్ బిల్లులు చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే పనులు కుంటుపడతాయి.

పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వానికి నివేదిక

పెండింగ్ బిల్లుల విషయాన్ని పీఆర్ ఈఈ వద్ద ప్రస్తావించగా.. రోడ్ల పనులు ఒకింత నెమ్మదిగా జరుగుతున్న మాట వాస్తవమేనని, అయితే పూర్తిగా నిలిచిపోలేదన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. త్వరలో నిధులు విడుదలవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



పల్లె పండుగలో నిర్మించిన సీసీ రోడ్డు.. ఈ పనికి ఇంకా నిధులు విడుదల కాలేదు

అనకాపల్లి వ్యవసాయ శాఖ జేడీగా ఆశాదేవి

మహారాణిపేట (విశాఖ): అనకాపల్లి జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఎం.ఆశాదేవి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె విశాఖలో వ్యవసాయశాఖ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మా) పీడీ పనిచేస్తున్నారు.

విశాఖ డీఆర్వోకు కలెక్టర్ క్లాస్?

10లో

నేడు యలమంచిలి ఎంపీపీపై అవిశ్వాసం

యలమంచిలి రూరల్:

యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్‌పై ఎంపీటీసీలు ఇచ్చిన అవిశ్వాస నోటీసుపై శనివారం సాయంత్రం యలమంచిలి మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కొండలరావు విలేకరులకు తెలిపారు. ఈ ప్రత్యేక సమావేశాన్ని అనకాపల్లి ఆర్డీవో ఆయిషా నిర్వహించనున్నారు. యలమంచిలి మండల పరిషత్‌లో ఏడు ఎంపీటీసీ స్థానాలుండగా 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఏడుగురు సభ్యులు వైఎస్సార్‌సీపీ నుంచే ఎన్నికయ్యారు. వారిలో ఒక ఎంపీటీసీ మరణించారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నలుగురు ఎంపీటీసీలను జనసేన నాయకులు ప్రలోభపెట్టి అనైతికంగా తమ పార్టీలో చేర్చుకున్నారు. ఇటీవల నాలుగేళ్ల పదవీ కాలం పూర్తి కావడంతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా నలుగురు ఎంపీటీసీలతో గత నెల 24వ తేదీన ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ నలుగురు ఎంపీటీసీలు సంతకాలు చేసి అనకాపల్లి ఆర్డీవోకు నోటీసు అందజేశారు. వెంటనే నలుగురు ఎంపీటీసీలతో అరకులో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుత మండల పరిషత్ పాలకవర్గానికి ఇంకా ఒక ఏడాది కాలం మాత్రమే మిగిలి ఉంది. దీనికోసం నలుగురు ఎంపీటీసీలు స్వార్థపూరితంగా వారు గెలిచిన వైఎస్సార్‌సీపీని కాదని జనసేనకు జైకొట్టడంతో వారి తీరుపై మండల ప్రజలు ఛీ కొడుతున్నారు.

మూడో రోజూ నిఘా నీడలో రాజయ్యపేట

- అడుగడుగునా పోలీసులు
- ఎక్కడికక్కడ తనిఖీలు
- గ్రామంలో పటిష్ట బందోబస్తు



వాహనాలను తనిఖీ చేసేందుకు ఉపమాక రోడ్డులో బారికేడ్లు అడ్డంపెట్టిన పోలీసులు

నక్కపల్లి: రాజయ్యపేటలో వరుసగా మూడో రోజు కూడా భారీ పోలీసు బందోబస్తు కొనసాగింది. బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు చేపట్టిన ఉద్యమం ఎప్పుడు ఏ విధంగా మారుతుందోనన్న ముందుజాగ్రత్తతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమయింది. మత్స్యకారుల వ్యూహాన్ని పోలీసు సిబ్బంది ముందుగా పసిగట్టలేకపోవడం వల్లే గ్రామంలోకి వచ్చిన హోంమంత్రిని అడ్డుకోవడం, ఆమె కాన్వాయ్‌కు అడ్డంగా తాటి, కొబ్బరి చెట్లు పడేసి ఘెరావ్ చేయడం, ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న జాతీయరహదారిని ముట్టడించి నాలుగు గంటలపాటు ధర్నా చేసి ట్రాఫిక్‌ను స్తంభింపజేయడం వంటి ఘటనలకు పాల్పడ్డారు. దీంతో జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా షాక్‌కు గురయింది. గ్రామంలోకి వచ్చి చర్చలు జరుపుతానని కలెక్టర్ హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా మత్స్యకారులు శాంతించారు. అనివార్య కారణాల వల్ల కలెక్టర్ పర్యటన వాయిదా పడింది. మత్స్యకారులు ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకున్నా దీటుగా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలనే ఉద్దేశంతో పక్క జిల్లాల నుంచి సుమారు వెయ్యిమందికి పైగా పోలీసులను రంగంలోకి దింపారు.

ఇద్దరు డీఎస్పీల పర్యవేక్షణలో బందోబస్తు

నర్సీపట్నం, అనకాపల్లి డీఎస్పీలు శ్రీనివాసరావు, శ్రావణిల ఆధ్వర్యంలో పోలీసులు రాజయ్యపేట పరిసర ప్రాంతాలను పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బందిని బందోబస్తు కోసం వినియోగించారు. వీరు కాకుండా స్పెషల్ బ్రాంచ్, ఇంటిలిజెన్స్ సిబ్బంది కూడా రాజయ్యపేట పరిసరాల్లో ఉన్నారు. మఫ్టీలో కొంతమంది సిబ్బంది గ్రామంలో ఉంటూ మత్స్యకారుల కదలికలపై నిఘా పెట్టారు. గ్రామస్తుల సంభాషణలపై కూడా ఆరా తీస్తున్నారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఎప్పటికప్పుడు ఇక్కడ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులంతా నక్కపల్లి, ఉపమాక, బోయపాడు, దొండవాక, హెటెరో కంపెనీ, తదితర ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేసుకుని బందోబస్తు నిర్వహిస్తున్నారు. రాజయ్యపేట వెళ్లే అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. వాహనాల నంబర్లను సయితం నమోదు చేసుకుంటున్నారు. ఎక్కడికక్కడ ఐరన్ బారికేడ్లు ఏర్పాటు చేశారు.

పక్క గ్రామాల నుంచి ఎవరినీ రానీయకపోవడంతో రాజయ్యపేట మత్స్యకారులు మాత్రమే దీక్ష కొనసాగిస్తున్నారు. గ్రామంలోను, బల్క్ డ్రగ్ ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు సెక్షన్ 30 అమలు చేస్తున్నారు. దీంతో దీక్షా శిబిరం వద్ద మినహా మరెక్కడా గుంపులుగా ఉండడాన్ని అనుమతించడం లేదు. కలెక్టర్ వచ్చి వెళ్లిన తర్వాతే దీక్ష కొనసాగించడమా వద్దా అనేది ఇరు వర్గాలు నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.



రాజయ్యపేట వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నిలిచిపోయిన బల్క్ డ్రగ్ పనులు

బల్క్ డ్రగ్ పార్క్ ఉద్యమం నేపథ్యంలో 15 రోజుల నుంచి పనులు నిలిచిపోయాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన లేబర్ వారి స్వగ్రామాలకు వెళ్లిపోయారు. ఈ వ్యవహారం తేలే వరకు ఎక్కడా పనులు చేయడానికి వీల్లేదని మత్స్యకారులు డిమాండ్ చేసిన నేపథ్యంలో వారిలో ఆగ్రహావేశాలు చల్లార్చేందుకు తాత్కాలికంగా పనులు నిలిపివేశారు.

22న 'చలో రాజయ్యపేట'

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా ఈ నెల 22న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చలో రాజయ్యపేట కార్యక్రమం నిర్వహించనున్నట్టు వీసం రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, కన్నబాబు, మాజీ ఎంపీ సత్యవతి, పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ తదితరులు హాజరవుతారన్నారు.

భగ్గుమన్న పాత్రికేయులు



నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయ ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర కార్యదర్శి స్వామి, జర్నలిస్టులు

'సాక్షి'పై కూటమి ప్రభుత్వ వేధింపులకు నిరసన



అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు



విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

దాబాగార్డెన్స్ (విశాఖ)/అనకాపల్లి/నర్సీపట్నం:

'సాక్షి' మీడియా సంస్థపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ జర్నలిస్టులు భగ్గుమన్నారు. ప్రజా సమస్యలను, ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపుతున్న 'సాక్షి' గొంతు నొక్కేందుకు పోలీసులను ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నంతోపాటు ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని మండలాల్లో వివిధ జర్నలిస్ట్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. నకిలీ మద్యం దందాను వెలుగులోకి తెచ్చినందుకు 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి, నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జికి బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ల కింద పోలీసులు నోటీసులు జారీ చేయడాన్ని జర్నలిస్టులు తీవ్రంగా తప్పుబట్టారు. ఇది పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగా అభివర్ణించారు. నిరసనలో భాగంగా పాత్రికేయులు చేతులకు సంకెళ్లు వేసుకుని, నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. 'కూటమి నిరంకుశ పాలన నశించాలి', 'అక్షరంపై దాడి సిగ్గు సిగ్గు', 'పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా?' అంటూ ప్లకార్డులు ప్రదర్శించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలు జర్నలిస్ట్ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మీడియాపై అణచివేత ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను అణచివేయాలని చూడటం రాజ్యాంగ విరుద్ధమని, ఇలాంటి చర్యల ద్వారా జర్నలిజాన్ని భయపెట్టలేరని హెచ్చరించారు. ప్రభుత్వం తన దాష్టీకాన్ని ఆపి, పత్రికా స్వేచ్ఛను గౌరవించాలని డిమాండ్ చేశారు. విశాఖ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకుడు ఎంఆర్‌ఎన్ వర్మ, ఏపీడబ్ల్యూజే నాయకుడు, పి.నారాయణ్, జాతీయ జర్నలిస్ట్‌ల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబుతోపాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో..

స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద జర్నలిస్టుల సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించి, ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయిషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి ఆళ్ల వెంకట అప్పారావు, అనకాపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మళ్ల భాస్కరరావులు మాట్లాడుతూ ఏ ప్రభుత్వమైనా పత్రికలపై కక్షపూరితంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. పత్రికల్లో ప్రభుత్వ వ్యతిరేక కథనాలు ప్రచురితమైతే అధికారులు ఖండన ఇవ్వాలే గానీ కక్షపూరితంగా పోలీసులను కార్యాలయాలకు మీదకు పంపడం అన్యాయమన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోవాలని, లేని పక్షంలో ప్రతిఘటన తప్పదన్నారు. అనకాపల్లి ప్రెస్ క్లబ్ కార్యదర్శి భీమరశెట్టి గణేష్, ఎలక్ట్రానిక్ మీడియా అనకాపల్లి అధ్యక్షుడు సీహెచ్ సర్వారావు, వివిధ జర్నలిస్టుల సంఘాల నాయకులు బుద్ధ రమణాజీ, కొండలరావు, పి.వీరబాబు, మంత్రి నారాయణమూర్తి, ఆళ్ల రామచంద్రరావు, గంగాధర్, బుదిరెడ్డి మధుసూదనరావు, పెంటకోట సత్యనారాయణ, పెద్దాడ నాయుడు, యడ్ల రామకృష్ణ, బోసు, బొద్దపు కిరణ్, బొడ్డేడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహాలక్ష్మినాయుడుకు రాష్ట్ర స్థాయి పురస్కారం



అవార్డు, ప్రశంసా పత్రం అందుకుంటున్న మహాలక్ష్మినాయుడు

రావికమతం: మండలంలోని మేడివాడ హైస్కూల్‌కు చెందిన ప్రత్యేక ఉపాధ్యాయుడు బి.మహాలక్ష్మినాయుడు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న సేవలను గుర్తించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ టీచర్ అవార్డుకు ఆయన్ను సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ ప్రతినిధులు ఎంపిక చేశారు. విజయవాడలో రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం స్టేట్ కో–ఆర్డినేటర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.కె. అన్నపూర్ణ నుంచి ప్రశంసాపత్రం, అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా సహిత విద్య సమన్వయకర్త రామకృష్ణ నాయుడు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించలేదని ల్యాబ్ పరీక్షలకు అనుమతించలేదు

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి ఎస్ఎస్ఆర్ఐఈటీ కళాశాల యాజమాన్యం ట్యూషన్ ఫీజు చెల్లించని విద్యార్థులను ల్యాబ్ పరీక్షలకు అనుమతించలేదు. దీంతో శుక్రవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. గత విద్యా సంవత్సరం నుంచి కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయనందున కళాశాలల యాజమాన్యాలు నిర్వహణ ఖర్చులు భరించలేక విద్యార్థులపై ఒత్తిడి తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఎస్ఎస్ఆర్ఐఈటీ యాజమాన్యం విద్యార్థులు రూ.10 వేల చొప్పున చెల్లిస్తేనే సెమిస్టర్ పరీక్షలకు అనుమతిస్తామని చెప్పడంతో కొందరు విద్యార్థులు చెల్లించారు. ఫీజు చెల్లించలేని విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రాధేయపడినా యాజమాన్యం అనుమతించలేదని వాపోయారు. కళాశాలకు చెల్లించాల్సిన అన్ని రకాల ఫీజులు చెల్లించినా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడంలో విఫలం కావడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్ ఖాదర్‌బాబాను వివరణ కోరగా ఫీజు చెల్లించని విద్యార్థులను ల్యాబ్ పరీక్షలకు అనుమతించలేదన్నది వాస్తవం కాదన్నారు.

యథేచ్ఛగా మెటల్ అక్రమ తరలింపు

- రాత్రికి రాత్రే కొండలను తవ్వేస్తున్న వైనం
- పట్టించుకోని రెవెన్యూ, మైన్స్ అధికారులు

చోడవరం: కూటమి పాలనలో దోచుకున్నవారికి దోచుకున్నంతగా అన్నట్టుగా అక్రమార్కులు కొండలను కొల్లగొడుతున్నారు. మండలంలో మైన్స్, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గోవాడ, ముద్దుర్తి, నర్సాపురం, రాయపురాజుపేట, అడ్డూరు, గంధవరం, బెన్నవోలు, ఖండిపల్లి, వెంకన్నపాలెం, ఎం. కొత్తపల్లి, దుడ్డుపాలెం గ్రామాల పరిధిలోని కొండల్లో యథేచ్ఛగా మెటల్ అక్రమ క్వారీలు నడుస్తున్నాయి. గోవాడలో ఏకంగా కొండను తవ్వేసి మెటల్ అమ్మేసుకోవడంతోపాటు రహదారులే ఏర్పాటు చేసుకుంటున్నాడో ప్రబుద్ధుడు. వాస్తవానికి ఎర్ర మెటల్ తవ్వకాలు, రవాణా చేయాలంటే ముందుగా రెవెన్యూ, మైన్స్ శాఖల అనుమతి పొందాల్సి ఉంది. కాని చోడవరం మండలంలో మాత్రం అవేమీ లేవు. స్థానిక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఎవరికి తోచినంత వారు తవ్వేసుకుని తరలించుకుపోతున్నారు. పొక్లెయిన్లు, జేసీబీ యంత్రాల సాయంతో ఎక్కడికక్కడ కొండలను తవ్వేసి లారీలు, ట్రాక్టర్లపై తరలించుకుపోతున్నారు. రాత్రిళ్లు ఎక్కువగా ఇక్కడ క్వారింగ్ జరుగుతోంది. దీనికి స్థానిక అధికార పార్టీ నాయకుల సహకారం ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. గోవాడలో రియల్టర్లతో కుమ్మక్కై ఈ దందా నడుస్తున్నట్టు తెలిసింది. గంధవరం, అడ్డూరు, ముద్దుర్తి, నర్సాపురం, వెంకన్నపాలెం గ్రామాల్లో రియల్టర్లు పక్కనే ఉన్న కొండల నుంచి ఎర్ర మెటల్, మట్టిని తవ్వేసి భూములను ఎత్తుచేసి ప్లాట్లు వేసి అమ్ముతున్నారు. స్థానిక గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వోలు) సహకారంతోనే ఇదంతా జరుగుతుందని ఆరోపణలు ఉన్నాయి. పర్యవేక్షించాల్సిన మండల రెవెన్యూ అధికారులు అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గడంతో అక్రమ క్వారీలు ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి కొండలను తవ్వేస్తున్నారని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల పలు గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ బృందాలంటూ మొక్కుబడిగా కమిటీలు వేసినా అవి నామమాత్రంగానే ఉన్నాయి. ఎక్కడా క్వారీ తవ్వకాలను నిరువరించడంలేదు. ఇలా అనుమతి లేకుండా కొండలను తవ్వేసుకోవడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం రాకపోగా, పర్యావరణాన్ని పరిరక్షించే కొండలు, పచ్చదనం కూడా నాశనమయ్యే ప్రమాదం ఏర్పడింది. దీనిపై మైన్స్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గోవాడ కొండను తొలిచేసిన దృశ్యం (ఇన్‌సెట్) గంధవరం రెవెన్యూలో కొండను తవ్వేసిన అక్రమార్కులు

విశాఖ డీఆర్వోకు కలెక్టర్ క్లాస్?

- రెవెన్యూలో 'లేఖ' ప్రకంపనలు

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: విశాఖ ఆర్డీవో శ్రీలేఖ రాసిన లేఖ వ్యవహారంపై 'రెవెన్యూలో శ్రీలేఖ కలకలం' శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనం జిల్లా రెవెన్యూ శాఖలో ప్రకంపనలు సృష్టించింది. ఉన్నతాధికారుల మధ్య కోల్డ్ వార్ వెలుగులోకి రావడంతో రెవెన్యూ, నిఘా వర్గాల ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి.. ఏం జరుగుతోందని ఆరా తీశారు. జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ శుక్రవారం హుటాహుటిన కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను కలిశారు. ఈ అంశంపై వారిద్దరి మధ్య సుదీర్ఘ చర్చ జరిగినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో డీఆర్వో తీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేయడంతో పాటు ఆయనకు క్లాస్ పీకినట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ వివాదంపై రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు కూడా స్పందించారు. కలెక్టర్‌ను కలిసి, శాఖ ప్రతిష్టకు భంగం కలగకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయాలని, అనవసర రాద్ధాంతం చేయవద్దని కలెక్టర్ వారికి సూచించినట్లు సమాచారం.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 11 అర్జీలు



ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న జేసీ జాహ్నవి



పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్పీ తుహిన్ సిన్హా

తుమ్మపాల: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్‌లో ఆమెతో పాటు డీఆర్వో వై.సత్యనారాయణరావు ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయమైన, అవకాశం ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. మొత్తం 11 మంది ఉద్యోగులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. రెవెన్యూ శాఖ–3, వైద్య ఆరోగ్య శాఖ– 2, ఖజానా శాఖ, గ్రామీణ అభివృద్ధి, సర్వే, ల్యాండ్ సెటిల్‌మెంట్, విద్యా శాఖ, వెనకబడిన తరగతుల శాఖ, మున్సిపల్ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి విజయ్ కుమార్, పీజీఆర్ఎస్ సెల్ పర్యవేక్షకుడు సురేష్ నాయుడు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

అనకాపల్లి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీసులు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలపై ఎస్పీ తుహిన్ సిన్హాకు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రాధాన్యమని, సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సిబ్బంది నుంచి మొత్తం 8 అర్జీలు అందాయన్నారు.

అప్పన్న ఆలయ లీకేజీ పనులు పూర్తి

రూ.5 కోట్ల సొంత నిధులతో పూర్తిచేసిన పూణేకి చెందిన శ్రీవెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ పైకప్పు మరమ్మతు పనులు శుక్రవారంతో పూర్తయ్యాయి. వర్షాలకు ఆలయ పైకప్పు నుంచి నీరు లోపలికి చేరుతుండటంతో ఆలయంతోపాటు, ఆలయ ప్రాంగణంలోని కల్యాణమండపం, నివేదనశాల, మ్యూజియం ఉన్న భవనంలో లీకేజీలు అరికట్టేందుకు 9 నెలల కిందట శాస్త్రీయ పద్ధతిలో పనులు ప్రారంభించారు. ఆ పనులు పూర్తికావడంతో సింహగిరిపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి పురావస్తుశాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి సంబంధిత వివరాలను మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలో తొలుత శ్రీకాళహస్తి ఆలయంలో వర్షం నీరు లీకేజీని అరికట్టే పనులు చేపట్టామన్నారు. ఆ రోజుల్లో నిర్మాణ పనులు ఎలా చేశారో అదే పద్ధతిలో శ్రీకాళహస్తి ఆలయంలో లీకేజీలను అరికట్టేందుకు పూణేకి చెందిన శ్రీవెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్(వెంకీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్)ను సంప్రదించామన్నారు. అక్కడ ఉత్తమ ఫలితాలు రావడంతో ఆ తర్వాత శ్రీశైలం ఆలయంలో పనులు చేపట్టామన్నారు. సింహాచలం ఆలయం పైకప్పు లీకేజీ పనుల విషయాన్ని ఎమ్మెల్యే గంటా సూచనలతో వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రూ.5 కోట్ల సొంత వ్యయంతో 9 నెలల్లో లీకేజీ నిర్మూలన పనులను ట్రస్ట్ పూర్తిచేసిందన్నారు. మరో 200 ఏళ్ల వరకు ఎలాంటి లీకేజీలు ఉండవన్నారు. గంటా మాట్లాడుతూ అప్పన్న ఆలయంలోకి వర్షం నీరు చేరకుండా గతంలో పలుమార్లు నివారణ పనులు జరిగినా పూర్తిగా సఫలీకృతం కాలేదన్నారు. దీంతో వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్‌ని సంప్రదించి, పురాతన ఆలయాల నిర్మాణ సాంకేతికతను ఉపయోగించి వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ లీకేజీలను అరికట్టే పనుల్ని చేసిందన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, అర్చకులు, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, తదితరులు పాల్గొన్నారు.



పనులు పూర్తయిన తర్వాత అప్పన్న ఆలయ పైభాగం

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా



విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులు

అనకాపల్లి: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని విద్యుత్ కాంట్రాక్ట్, కార్మిక, ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ, యునైటెడ్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గవరపాలెం విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలని, కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేసిన కార్మికులకు నేరు విద్యుత్ సంస్థ జీతాలు చెల్లించాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.చంద్రశేఖర్, ఆర్.సత్యారావు, కాంట్రాక్టు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ అందుబాటులో లేక గిరిజనుడి మృతి!

పాడేరు: అత్యవసర వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు వెళ్లాల్సి ఉండగా సకాలంలో అంబులెన్స్ సౌకర్యం లేక ఓ గిరిజనుడు మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పాడేరు మండలం వంట్లమామిడి పంచాయతీ చోడిపల్లి గ్రామానికి చెందిన మాదెల రామ్మూర్తి అనే గిరిజనుడు మలేరియా, టైఫాయిడ్ లక్షణాలతో జిల్లా ఆస్పత్రిలో చేరి వైద్య చికిత్స పొందుతున్నాడు. ఉన్నట్టుండి గురువారం రాత్రి 10 గంటలకు ఆయనకు ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో అత్యవసరంగా విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకువెళ్లాలని వైద్యులు రిఫర్ చేశారు. ఇంతలో జిల్లా ఆస్పత్రిలో అంబులెన్స్ డ్రైవర్‌కు, రోగి కుటుంబ సభ్యులకు చిన్న విషయంపై ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో విషమ స్థితిలో ఉన్న రోగిని వదిలేసి మరొక పేషెంట్‌ను ఎక్కించుకొని అంబులెన్స్ డ్రైవర్ విశాఖపట్నం వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. చాలా సేపటి తర్వాత మరో అంబులెన్స్‌లో విశాఖపట్నం తరలిస్తుండగా చోడవరం సమీపంలో రామ్మూర్తి మృతి చెందాడన్నారు. అంబులెన్స్ ఆలస్యమై సకాలంలో విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకువెళ్లకపోవడంతో రామ్మూర్తి మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

యూరియా కోసం ఎదురు చూపులు



కశింకోటలో ఎరువుల దుకాణం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

కశింకోట: యూరియా అరకొర సరఫరాతో రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొనక తప్పలేదు. శుక్రవారం స్థానిక ప్రైవేటు ఎరువుల డీలర్ దుకాణం వద్ద గంటల తరబడి బారులు తీరారు. ప్రస్తుతం ఎదుగుదల, పొట్ట దశలో వరి పంట ఉంది. కొందరు ఆలస్యంగా నాట్లు వేశారు. ఈ నేపథ్యంలో యూరియా తప్పనిసరిగా వేయాల్సి ఉంది. లేదంటే పెరుగుదల ఉండదు. యూరియా ఇవ్వనున్నట్లు తెలియడంతో రైతులు ఎరువు కోసం దుకాణం వద్ద ఉదయం నుంచి బారులు తీరారు. అరకొరగా తక్కువ నిల్వ ఉన్న మేరకు సరఫరా చేశారు. మిగిలిన వారికి ఈ నెల 22న రావాలని, ఆ రోజుకి మళ్లీ యూరియా రానుందని డీలర్ పేర్కొని వెనక్కి పంపించి వేశారు. దీంతో కశింకోటతోపాటు ఏనుగుతుని, ఇతర గ్రామాల నుంచి వచ్చిన రైతులు యూరియా కష్టాలు ఎన్నాళ్లకు తీరేనో అంటూ తీవ్ర నిరాశతో వెనుదిరిగారు.

తాటాకిల్లు దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన ఇల్లు



నగదు, దుస్తులు అందజేస్తున్న తహసీల్దార్, స్థానికులు

మాకవరపాలెం: మండలంలోని జి.కోడూరులో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమైంది. గ్రామంలోని దళితవాడలో నివాసం ఉంటున్న ఉలంపర్తి అప్పయ్యమ్మ, బాబూరావులకు చెందిన ఇల్లు శుక్రవారం మధ్యాహ్నం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటిలోపల ఉన్న ధాన్యం, వెండి, బంగారు వస్తువులు, ఇతర సామగ్రి కాలిబూడిదయ్యాయి. రూ.లక్షకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. దగ్ధమైన ఇంటిని తహసీల్దార్ వెంకటరమణ పరిశీలించారు. ఆయన, గ్రామస్తులు కలిసి బాధితులకు గ్యాస్ సిలిండర్, స్టవ్, రూ.20 వేల నగదు, దుస్తులు, 50 కిలోల బియ్యం అందజేశారు.

డివైడర్‌ను ఢీకొని విద్యార్థి దుర్మరణం

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు ప్రమాదంలో విజయనగరానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి చిలకలపల్లి విశాల్ (21) ప్రాణాలు కోల్పోయాడు. గీతం విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న ఆయన పెందుర్తిలోని పురుషోత్తమపురంలో తన మామయ్య ఇంట్లో ఉంటున్నాడు. గురువారం సాయంత్రం తన స్నేహితుడు సూర్యతో కలిసి కళాశాల నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. హనుమంతవాక మీదుగా బీఆర్‌టీఎస్ రోడ్డులో శ్రీకృష్ణాపురం సమీపంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన విశాల్ గుండెకు తీవ్ర గాయం తగిలి అంతర్గత రక్తస్రావం జరిగింది. సూర్యకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన విశాల్ విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం పురోగతి

- డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ హరప్రసాద్

మద్దిలపాలెం : శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం పురోగతి సాధిస్తోందని డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్.వి.హర ప్రసాద్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఎన్ఎస్‌టీఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అకడమిక్ కాన్ఫరెన్స్–2025ను శుక్రవారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రారంభించారు. దేశీయంగా అభివృద్ధి చేసిన పలు సాంకేతికతలు సమర్థవంతంగా వినియోగించి సత్ఫలితాలను సాధించిన విధానాన్ని వివరించారు. డీఆర్‌డీవో సమిష్టిగా విశ్వవిద్యాలయాలు సాంకేతిక విద్యాసంస్థలతో కలసి పరిశోధనలు నిర్వహించే దిశగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 100 విద్యాసంస్థలకు చెందిన 500 మందికి పైగా ప్రతినిధులు ఈ సదస్సులో భాగస్వామ్యం అయ్యారన్నారు. నీటిలోపల లోతైన ప్రదేశంలో సమాచారాన్ని సంగ్రహించి, విశ్లేషించే నూతన వ్యవస్థలు, స్టెల్త్ టెక్నాలజీ, సెన్సార్లు వంటివి దేశీయంగా అభివృద్ధి చేయడం, వినియోగించడం జరుగుతోందని తెలిపారు. ఏయూ వీసీ ఆచార్య జి.పి. రాజశేఖర్ మాట్లాడుతూ సాంకేతికతలో స్వీయ వికాసం కలిగి ఉండాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థల నుంచి నూతన ప్రాజెక్టర్ టామ్‌సేజ్ సాంకేతికతలను అభివృద్ధి చేసే దిశగా పరిశోధనలో పెరగాలని సూచించారు. ఐడీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్ మను కోరుల్లా వర్చువల్ విధానంలో మాట్లాడుతూ రానున్న రోజుల్లో 100 పేటెంట్లు సాధించడం లక్ష్యంగా కలిసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జి.శశిభూషణరావు, కార్యక్రమ సమన్వయకర్త ఆచార్య టి.వి.కె భానుప్రకాష్, ఏఐటీ, ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త వివిఎస్ సాజీ, డిప్యూటీ శాస్త్రవేత్త టి.వేణుగోపాలరావు, డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ డాక్టర్.ఆర్.వి.హరప్రసాద్

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఇద్దరు ఎంపిక





ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన కె.జె.పురం, తేగాడ విద్యార్థినులు మళ్ల గౌతమి, లిప్షాకు జ్ఞాపిక, ధ్రువపత్రం అందజేత

కశింకోట: రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో శుక్రవారం జిల్లా సైన్స్ సెమినార్ నిర్వహించారు. ఇందులో విశేష ప్రతిభ ప్రదర్శించిన మాడుగల మండలం కేజేపురానికి చెందిన మళ్ల గౌతమి ప్రథమ, కశింకోట మండలం తేగాడ మోడల్ స్కూలు విద్యార్థిని జి. లిప్షా ద్వితీయ స్థానం పొందారు. వీరికి జ్ఞాపికతోపాటు ప్రతిభా ధ్రువపత్రాలను అందజేశారు. వీరు ఈ నెల 18న విజయవాడలో రాష్ట్ర స్థాయి సెమినార్‌కు హాజరు కానున్నారు. డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, ఉప విద్యా శాఖ అధికారి పొన్నాడ అప్పారావు అభినందనలు తెలిపారు. ఇటువంటి సెమినార్లు విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయన్నారు. జిల్లా సైన్స్ అధికారి దాడి కాళిదాసు మాట్లాడుతూ సంప్రదాయ ఫిజిక్స్ నుంచి క్వాంటం ఫిజిక్స్‌కు మారుతున్న తరుణంలో అంతే వేగంతో అభివృద్ధి జరిగి ఫలాలు అందరికి అందగలవన్నారు. సెమినార్‌కు జ్యూరీ సభ్యులుగా ఏఎంఏఎల్ కళాశాల ఉప ప్రిన్సిపాల్ బి. నిరంజన్ కుమార్, డీవీఎన్ కళాశాల అధ్యాపకురాలు ఎన్. భాగ్యలక్ష్మి వ్యవహరించారు. ఎంఈవోలు కేఎస్ఎన్ మూర్తి, సురేష్ కుమార్, జిల్లాలో మండలానికి ఇద్దరు వంతున 34 మంది విద్యార్థులు, గైడ్ టీచర్లు హాజరయ్యారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఢీకొని నవ వధువు మృతి చెందగా, ఆమె భర్త గాయపడ్డాడు. ఆరిలోవ బీఆర్‌టీఎస్ రోడ్డు మార్గంలో జరిగిన మరో ప్రమాదంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో గీతం ఇంజినీరింగ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు.

ఆర్టీసీ బస్సు ఢీ.. నవ వధువు మృతి భర్తకు తీవ్ర గాయాలు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం కూడలి వద్ద శుక్రవారం తెల్లవారుజామున మృత్యువు కాపు కాసింది. పెళ్లై ఏడాదైన జంట స్కూటీపై ప్రయాణిస్తుండగా.. ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు వారి జీవితాలపై కబళించింది. నిండు నూరేళ్ల దాంపత్యం ఒక్క క్షణంలోనే విషాదంగా ముగిసింది. కూర్మన్నపాలెం ముఖ్య కూడలి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదగంట్యాడ మండలానికి చెందిన వియ్యపు ఉమాదేవి(22) మృతి చెందగా, ఆమె భర్త పైడిరాజు గాయపడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు అందించిన వివరాలివి.. విశాఖ ఉక్కు కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న వియ్యపు పైడిరాజు, తన తల్లిదండ్రులు, భార్యతో కలిసి పెదగంట్యాడ మండలం సీతానగరంలో నివాసం ఉంటున్నాడు. అనకాపల్లి మండలం కొత్తూరులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాల్సి ఉండడంతో శుక్రవారం తెల్లవారుజామున భార్య ఉమాదేవితో కలిసి స్కూటీపై ఇంటి వద్ద బయలుదేరాడు. కూర్మన్నపాలెం కూడలికి సమీపిస్తున్న సమయంలో.. సింథియా నుంచి చోడవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వారి స్కూటీని బలంగా ఢీకొంది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న ఉమాదేవి కుడి వైపునకు, పైడిరాజు ఎడమ వైపునకు పడిపోయారు. ఉమాదేవిపై నుంచి బస్సు చక్రాలు దూసుకుపోవడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించగా, ఆమె అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పైడిరాజుకు నడుము భాగంలో తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా.. ఉమాదేవికి, పైడిరాజుకు వివాహం జరిగి ఏడాది కావస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి.. ఉమాదేవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



ఉమాదేవి(ఫైల్)

సీతానగరంలో విషాదఛాయలు

పెదగంట్యాడ: ఉమాదేవి దుర్మరణంతో సీతానగరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పెళ్లాయిన ఏడాదికే ఆమెను మృతువు బస్సు రూపంలో కబళించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

అక్రమ దందా

కూటమి పాలనలో దోపిడీ పర్వానికి తెరలేపారు. ప్రధాన జంక్షన్లలో అనధికారకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇసుక, రాయిపిక్క వంటివి తరలించే ట్రాక్టర్లు, లారీలను లక్ష్యంగా చేసుకుని నగదు వసూళ్లు చేస్తున్నారు. వీటికి బిల్లులు అడిగితే వాహన డ్రైవర్లను బెదిరిస్తున్నారు. గత పది రోజులుగా సాగుతున్న ఈ అక్రమ దందాపై నిలదీస్తే దిక్కున్నచోట చెప్పుకోమని దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఈ తతంగంపై సంబంధిత అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అనధికార వసూళ్లపై మార్టూరులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ముట్టడించిన డ్రైవర్లు

- గ్రామాల్లో వెలసిన అనధికార చెక్‌పోస్టులు
- గ్రావెల్ తరలించే లారీలు, ట్రాక్టర్ల నుంచి నగదు వసూళ్లు
- వాహన యజమానులతో దురుసు ప్రవర్తన
- పట్టించుకోని అధికారులు

తుమ్మపాల: సీనరేజ్ చెల్లిస్తేనే లారీలు, ట్రాక్టర్లు కదులుతాయంటూ అనధికార వ్యక్తులు అడ్డుకోవడం, నగదు చెల్లించిన వాహనాలకు బిల్లులు ఇవ్వకపోవడంపై మండలంలో లారీలు, ట్రాక్టర్ల యాజమానులు కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. వందల సంఖ్యలో టిప్పర్లతో తరలించుకుపోతున్న మైనింగ్‌ను అడ్డుకోలేని అధికార యంత్రాంగం భవన నిర్మాణాలు, గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి పనులకు సరుకులు తరలించే లారీలు, ట్రాక్టర్లపై దారి దోపిడీ చేయడం అన్యాయమంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి అధికారంలోకి రావడం మొదలు భవన నిర్మాణ రంగం కుదేలైంది. అనకాపల్లి మండలం ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ముఖ్యంగా భవన నిర్మాణాలకు బిల్లులు నిలిపివేయడం, ఇతర నిర్మాణాలకు ఏడాదిగా ఇసుక, రాయిపిక్క, వంటి సామగ్రి కొరత ఏర్పడింది. ఇప్పుడిప్పుడే మొదలైన ఈ పనులకు సామగ్రి తరలించే ట్రాక్టర్లు, లారీలను లక్ష్యంగా ప్రైవేటు వ్యక్తులు అడ్డంకులు సృష్టిస్తున్నారు. పనుల్లేక ఏడాదిగా ఖాళీగా ఉన్న ట్రాక్టర్లతో ఉచిత ఇసుక, క్రషర్ల నుంచి పిక్క, రాయి, క్రషింగ్ సరుకులు తరలిస్తూ ఉపాధి పొందుతున్న వారి నుంచి సీనరేజ్ పేరుతో అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారు.

బిల్లులు లేకుండా సీనరేజ్ పేరుతో వసూళ్లు...

గృహ నిర్మాణాలకు క్రషర్ల నుంచి పిక్క, క్రషర్, రాయి తరలిస్తున్న ట్రాక్టర్లను రోడ్లపై నిలిపివేసి బిల్లులు చూపించాలంటూ ప్రైవేటు వ్యక్తులు రుబాబు చేయడంతో ఘర్షణలు జరుగుతున్నాయి. సీనరేజ్ పేరుతో కొన్ని చోట్ల నగదు వసూలు చేస్తూ ట్రాక్టర్ డ్రైవర్లకు కనీసం బిల్లులు ఇవ్వడం లేదు. తాము ప్రభుత్వానికి కోట్ల రూపాయలు చెల్లిస్తున్నామంటూ మొబైల్లో జీవోలు చూపిస్తూ దారి దోపిడీలు చేస్తున్నారు. నగదు చెల్లించపోతే ట్రాక్టర్లు కదిలేది లేదంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.



కేజీ రోడ్డులో బీఆర్టీ కాలనీ వద్ద క్వారీ లారీలను అడ్డుకున్న ప్రైవేటు వ్యక్తులు చిన ట్రాక్టర్ డ్రైవర్లు, యాజమానులు



తుమ్మపాల -మార్టూరు జంక్షన్ వద్ద ప్రైవేటు సంస్థ పేరుతో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

• గ్రామానికో అనధికార చెక్‌పోస్టు...

మండలంలో తుమ్మపాల, మార్టూరు, చింత నిప్పుల అగ్రహారం, మాకవరం, మామిడిపాలెం, బవులువాడ, సీతానగరం, వెంకుపాలెం, కూండ్రం, టి.వెంకుపాలెం, వేటజంగాలపాలెం, కుంచంగి, బీఆర్టీ కాలనీ, కొప్పాక, మారేడుపూడి, రేబాక వంటి అనేక గ్రామాల్లో అనధికారకంగా చెక్‌పోస్టులు వెలిశాయి. ఇక్కడ సీనరేజ్ వసూళ్ల పేరుతో ప్రైవేటు సంస్థ కొంతమంది వ్యక్తులను నియమించింది. వీరు లారీలు, ట్రాక్టర్లను దారి దోపిడీ చేస్తున్నారు. గ్రామాల్లోకి భవన నిర్మాణాలకు సామగ్రి రాకుండా బిల్లుల పేరుతో వేధిస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై రోడ్లపై తిరుగుతూ ట్రాక్టర్ల డ్రైవర్లకు బెదిరింపులు చేస్తున్నారు. ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా మండలంలో ఘర్షణలకు తావిచ్చేలా వ్యవహరిస్తున్న ప్రైవేటు వ్యక్తులపై సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా కనీసం స్పందించడం లేదంటూ డ్రైవర్లు వాపోతున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

ఏడాది కాలంగా అక్రమ మైనింగ్ అడ్డూఅదుపు లేకుండా జరుగుతోంది. కొండల్ని పిండి చేసి వందల సంఖ్యలో టిప్పర్లు రాత్రిపగలు తేడా లేకుండా మైనింగ్ సంపదను తరలించేస్తున్నాయి. ఇలాంటి దోపిడీపై ఎటువంటి లెక్కలు లేకుండా అధికారులు కూడా నెలసరి మామూళ్ల వసూలు చేసుకుంటూ పబ్బం గడుపుకుంటున్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న మండలంలోనే భారీ దోపిడీని అరికట్టలేని అధికారులు ప్రైవేటు వ్యక్తుల దోపిడీని సైతం చూసీచూడనట్టుగా వదిలేస్తున్నారు.

క్లుప్తంగా

సీపీఆర్‌పై రోగులకు అవగాహన



రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు లావణ్య

అనకాపల్లి: అత్యవసర సమయంలో రోగి స్పృహతప్పి పడిపోయిన సమయంలో సీపీఆర్ ద్వారా మనిషిని బతికించవచ్చని జిల్లా ఆయుర్వేద విభాగం అధికారి డాక్టర్ కె.లావణ్య తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి ఆవరణలోని ఆయుర్వేద ఆస్పత్రిలో సీపీఆర్‌పై రోగులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. సీపీఆర్ చేయడం ద్వారా కొన్ని సందర్భాల్లో రోగిని ప్రాణాలతో కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద ఆస్పత్రి వైద్యులు, రోగులు తదితరులు పాల్గొన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి



మొక్కల ఆకృతి బొమ్మలు ధరించిన విద్యార్థులు

అనకాపల్లి టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు విరివిగా మొక్కలు నాటాలని జాక్ అండ్ జిల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.ఎస్. లక్ష్మి తెలిపారు. పట్టణంలోని జాక్ అండ్ జిల్ స్కూల్‌లో గ్రీన్ డే సెలబ్రేషన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆకు కూరల్లో ఉండే ఆరోగ్య రహస్యాలు, అడవుల ప్రాముఖ్యత, మొక్కలను పెంచడం వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు విపులంగా వివరించారు. విద్యార్థులు కాయగూరలు, చెట్లు ఆకృతిలో బొమ్మలను ధరించి వాటిపై ఉన్న మమకారాన్ని చాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై. సాయి రమాదేవి, పి. దేవి, కె. నీలిమ, ఆర్. వెంకటలక్ష్మి, పి. సంగీత పాల్గొన్నారు.

సత్యసాయి నగర సంకీర్తన



సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్: భగవాన్ సత్యసాయి శత జయంత్యుత్సవాల్లో భాగంగా శుక్రవారం సత్యసాయి చిత్రపటాన్ని, పాదుకలను మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. ప్రత్యేక పూజలు, వేద పారాయణం, దివ్య నామ సంకీర్తన, పల్లకి సేవ, నగర సంకీర్తన, భజనలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక నర్సింగరావు పేటలో సీతారామా భజన సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్యసాయి భక్తులు ఎస్ఎస్ లక్ష్మి, సిహెచ్ అప్పారావు, ఎం అప్పలనాయుడు, ఐ శారద, సువాచల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 346 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,770	5,760
రెండో రకం	4,040	4,810
మూడోరకం	3,800	4,050

అనకాపల్లి సినిమాలు

రాజా	: తెలుసు కదా
సత్యనారాయణ స్క్రీన్-1	: కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: డ్యూడ్
పర్తిసాయి	: ఓజీ
షిర్డీసాయి	: మిత్రమండలి
వెంకటేశ్వర	: మమ్మీ ఈజ్ బ్యాక్
రామచంద్ర	మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయం రక్తనిధి కేంద్రంలో 64 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16, బీ పాజిటివ్-25, ఓ పాజిటివ్-19, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

మండల స్థాయి స్కూలు గేమ్స్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు



కబడ్డీ జట్టును అభినందిస్తున్న ఎంఈవోలు మూర్తి, సురేష్‌కుమార్

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో మండల స్థాయి స్కూలు గేమ్స్ శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలు మొదటి రోజు బాలురకు నిర్వహించారు. తొలుత ఈ పోటీలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు ఆటలు అవసరమేనన్నారు. ఆటలు శారీర దారుఢ్యాన్ని, మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఆటల్లో రాణిస్తే ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన చదరంగం పోటీలో తాళ్లపాలెం జెడ్పీ హైస్కూలుకు ప్రథమం, గీతా ప్రైమరీ స్కూలుకు ద్వితీయ స్థానం లభించాయి. షటిల్ బ్యాడ్మింటన్‌లో తేగాడలోని మోడల్ స్కూలు, కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూళ్లకు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు లభించాయి. వాలీబాల్‌లో కన్నూరుపాలెం జెడ్పీ హైస్కూలు, తేగాడ మోడల్ స్కూలుకు, యోగాలో కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు, సెయింట్ జాన్స్ స్కూళ్లకు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాలు లభించాయి. సమయం సరిపోక కబడ్డీ పోటీలు మూడు బ్యాచ్‌లు మిగిలిపోగా వాటితోపాటు ఖో-ఖో, ఈవెంట్స్ పోటీలు శనివారం నిర్వహించనున్నట్లు పీడీలు వి. ప్రభాకరరావు, పెంటకోట కమల తెలిపారు. శనివారం స్థానిక బాలికల హైస్కూలులో బాలికలకు ఆటల పోటీలు జరగనున్నాయన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 300 మంది బాలురు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, ఎంఈవోలు కేఎస్ఎన్ మూర్తి, సురేష్‌కుమార్, పీడీలు, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



బాలుర కబడ్డీ పోటీ



బాలుర వాలీబాల్ పోటీ

ఫిజియోథెరపీతో దీర్ఘకాలిక వ్యాధులు నయం



ఫిజియోథెరపిస్టు అపర్ణను శాలువాలతో సత్కరిస్తున్న వక్తలు

అనకాపల్లి: పక్షవాతం, ఇతర వ్యాధులకు ఫిజియోథెరపీ ద్వారా రోగికి నయం చేయవచ్చని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, వైద్యుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం, మాతృభూమి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి వివేకానంద నగర్‌లో వివేకానంద చారిటబుల్ ట్రస్ట్‌లో ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరీరంలో బీపీ, కొవ్వు ఎక్కువగా ఉండడం వల్ల పక్షవాతం, ఇతర వ్యాధులు వస్తాయన్నారు. మద్యం, మాదక ద్రవ్యాలు వాడడం వల్ల శరీరంలో రక్తనాళాలు దెబ్బతింటాయన్నారు. రక్తనాళాలు దెబ్బతినే సమయంలో పక్షవాతం, ఇతర వ్యాధలు బారినపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం ఫిజియోథెరపిస్టు వైద్యురాలు అపర్ణను సంఘం, సంస్థ సభ్యులు శాలువాలతో సత్కరించి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు జంగం జోషి, గ్రామీణ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

కొండపోరంబోకు స్థలాల్లో ఆక్రమణలపై చర్యలు



అసకపల్లిలో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ, తదితరులు

సబ్బవరం: మండలంలోని అసకపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెం.1లోని కొండ పోరంబోకు భూమిని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తన సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ భూమిలో కొత్తగా పలు ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను గుర్తించారు. వివరాలను మీడియాకు వెల్లడించారు. ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతో పాటు పొక్లెయిన్ సాయంతో తొలగించనున్నట్లు పేర్కొన్నారు. జగనన్న కాలనీ పక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని ఆక్రమించి ఫెన్సింగ్ ఫోల్స్ వేసిన వారిపై, రేకుల షెడ్‌లు నిర్మించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరికల బోర్డులను తొలిగించినవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సర్వే నెం.16లో చెరువు పోరంబోకు స్థలంలో కూడా ఆక్రమణలు గుర్తించామని, బాధ్యులపై క్రిమినల్, భూ ఆక్రమణ కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్ఐ వీరయ్య, సిబ్బంది ఉన్నారు.

అనుమతి లేని బాణసంచా స్వాధీనం



పట్టుబడిన బాణసంచా, నిందితుడితో సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: దీపావళి అమ్మకాల కోసం పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గవరజగ్గయ్యపాలెంలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన బాణసంచాను పోలీసులు సీజ్ చేసి నిందితుడ్ని అరెస్ట్ చేశారు. వివరాలివి.. గ్రామానికి చెందిన బొడ్డేటి వినోద్ రూ.30 వేలు విలువైన మందుగుండు సామాగ్రిని ఇంట్లో ఉంచాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేశారు. అనుమతి లేని బాణసంచాతో పాటు నిందితుడు వినోద్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

అన్నపూర్ణమ్మ నిజరూప దర్శనం నేడు

అనకాపల్లి: మండలంలో బట్లపూడి పంచాయతీ నాయుడుపేట సోహం ఆశ్రమంలో అన్నపూర్ణమ్మ నిజరూప దర్శనం ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ భక్తులకు కల్పించనున్నట్టు ఆశ్రమ నిర్వహకుడు కాండ్రేగుల రవి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18న ధన త్రయోదశి ఉదయం 9 గంటలకు అమ్మవారి నిజరూప దర్శనం, విశేష అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన, 19న సాయంత్రం అమ్మవారి శ్రీ చక్రానికి సిరిజ్యోతి పూజలు, 20న సాయంత్రం అమ్మవారి సారె ఊరేగింపు, 22 నుంచి నవంబర్ 20వ తేదీ వరకూ కార్తీకమాస పూజలు నిర్వహిస్తామన్నారు.

తెరచుకున్న వరాహ లక్ష్మీనరసింహ ఆలయం

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధిలో వరాహ లక్ష్మీనరసింహ ఆలయంలో శుక్రవారం నుంచి యధావిధిగా పూజలు నిర్వహించినట్లు ఆలయ మాజీ ధర్మకర్త మళ్ల రామచంద్రరావు తెలిపారు. రెండు రోజులుగా వీధి పెద్దలతో ఆలయ ఆదాయ వ్యయాలు, ఆభరణాలపై సుదీర్ఘంగా చర్చించిన మేర అందరి అంగీకారంతో యధావిధిగా ఆలయాన్ని తెరిచి భక్తులకు దర్శనం కల్పించినట్లు పేర్కొన్నారు.

పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న డీజీఎం సురేష్‌కుమార్

కశింకోట: మండలంలోని ఏఎస్ పేట వద్ద రామ్‌కో సిమెంట్ పరిశ్రమకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ పురస్కారం లభించింది. సిమెంట్ తయారీలో అత్యుత్తమ ప్రమాణాలు పాటించి నాణ్యమైన సిమెంట్ అందిస్తున్నందుకుగాను పురస్కారం వచ్చిందని పరిశ్రమ యూనిట్ హెడ్ సికిందర్ బాషా తెలిపారు. విజయవాడలో బీఐఎస్ డైరెక్టర్ ప్రేమ సజని పట్నాల నుంచి ప్లాంట్ డీజీఎం, ప్రాసెస్, క్వాలిటీ హెచ్ సిహెచ్. సురేష్‌కుమార్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ పురస్కారం ఉద్యోగులు, కార్మికుల సమష్టి కృషితో లభించిందని ఆనందం వ్యక్తం చేశారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని సింహాచలం పాత గోశాల వద్దనున్న శ్రీనివాసనగర్‌లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న పేకాట శిబిరంపై పెందుర్తి పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.9,160 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు.

సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడికి నిరసన



తహసీల్దార్ తిరుమలరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కశింకోట: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై బూటుతో దాడి చేయడానికి యత్నించిన వ్యక్తిని అరెస్టు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన శుక్రవారం తెలిపారు. అనంతరం తహసీల్దార్ తిరుమలరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు కొల్లి చిన్న అప్పారావు మాట్లాడుతూ ఈ నెల 7న సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిశోర్ బూట్‌ను విసిరి దాడికి యత్నించారన్నారు. ఈ దాడి అనాగరికమైనదని, దీన్ని రాజ్యాంగంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. దళితుడైన గవాయి చీఫ్ జస్టిస్ కావడాన్ని కొన్ని ఆధిపత్య శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. అందుకే ఈ దాడి చేశారని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు చెవ్వేటి నాగరాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముప్పిడి అప్పారావు, స్థానిక నాయకులు చెవ్వేటి అప్పలరాజు, కొల్లి రమణ, చెవ్వేటి పరమేష్, చెవ్వేటి నరసింగరావు, వెలుచూరు నాని సింగల్ మధు తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవం నేడు



కశింకోటలో గౌరీపరమేశ్వరుల విగ్రహం ఊరేగింపు

అనకాపల్లి టౌన్: ఉత్తరాంధ్రలోనే పేరు ప్రఖ్యాతులు గాంచిన వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల నిలుపు మహోత్సవం ఈ నెల 18న చేపడుతున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గరికి వెంకట్రావు, నాసేపల్లి రవి తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు వేల్పుల గణేష్ ఇంటి వద్ద నుంచి పీఠం తీసుకువెళ్లి, వరి దుబ్బుతో ఉత్సవ విగ్రహానికి పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం పట్టణ వీధుల్లో ఊరేగించి అమ్మవారి ఆలయంలో ఆదివారం తెల్లవారు జామున విగ్రహాన్ని నిలుపు చేస్తామని తెలిపారు.

కశింకోట: మండలంలోని జమాదులపాలెంలో శనివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడ దీపావళికి ముందు గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని నిలిపి పూజలు నిర్వహించి ఉత్సవం నిర్వహిస్తారు. బంధువులను పిలిచి ఉత్సవాన్ని గ్రామస్తులు పెద్ద పండగలా చేసుకుంటారు. మండలంతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా ఉత్సవంలో పాల్గొంటారు. ఈ సందర్భంగా గౌరీపరమేశ్వరుల విగ్రహాన్ని సాయంత్రం గ్రామంలో కోలాటాలు, తప్పెటగుళ్లు, నేల వేషాలతో ఊరేగించి జాతీయ రహదారి వద్ద చెరువులో సంప్రదాయంగా నిమజ్జనం చేస్తారు. ఉత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను, పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ ఏర్పాటుతోపాటు బాణసంచా కాల్చనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

కశింకోట: స్థానిక గవరపేటలో శుక్రవారం రాత్రి గౌరీపరమేశ్వరుల నిలుపు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌరమ్మ విగ్రహాన్ని గ్రామ వీధుల్లో బాణసంచా కాలుస్తూ ఊరేగించి పెద్ద గుమ్మం వద్ద శారదా గణపతి రామాలయంలో నెలకొల్పారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసంలో నిత్య పూజలు నిర్వహించి గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'సహకార రంగాన్ని బతికించండి'

అనకాపల్లి: సహకార రంగాన్ని కాపాడేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సూరిశెట్టి రమణఅప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత టీడీపీ పాలనలో రాష్ట్రంలో మూతపడిన నెల్లూరు, నంద్యాల, కడప, కర్నూలు, కొవ్వూరు, భీమసింగ్, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలను 2004 ఎన్నికల హామీ మేరకు ఆరు మాసాల్లో రూ.63 వేల కోట్లు చెల్లించి తిరిగి తెరిపించిన ఘనత అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రస్తుతం సహకార రంగంలో నడుస్తున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవటంతో రైతులు, కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మంది జీవనోపాధికి విఘాతం కలిగిందన్నారు. 200 గ్రామాల రైతులు చెరకు పంట పండించి ఫ్యాక్టరీపై ఆధారపడేవారన్నారు. గూగుల్ వస్తే ఉద్యోగాలు ఎన్ని వస్తాయో తెలియదుకాని, సహకార రంగంలో లక్షల మందికి ఉపాధి పోయిందన్నారు.

ఘనంగా ఊంజల్ సేవ



ఊంజల్ సేవా కార్యక్రమంలో అర్చకులు, భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 209వ ఊంజల్ సేవా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, శేషుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కొణతాల ఈశ్వరరావు పుష్పలత దంపతుల పాల్గొన్నారు. గౌరీ గీత మహిళా మండలి సత్తెమ్మతల్లి దేవస్థానం మహిళా మండలి ఆధ్వర్యంలో భరతనాట్యం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నపాలెం లక్ష్మి బార్‌పై కేసు నమోదు

పెందుర్తి: వేపగుంట దరి అప్పన్నపాలెంలోని లక్ష్మి బార్‌పై కేసు నమోదు చేసినట్లు పెందుర్తి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.సరోజాదేవి తెలిపారు. శుక్రవారం నాయుడుతోటలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఉదయం 10 గంటల్లోపే బార్ తెరిచినట్లు తమకు సమాచారం రావడంతో తక్షణమే పరిశీలించామన్నారు. ప్రాథమిక ఆధారాలు ఉండడంతో బార్‌పై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. దీంతోపాటు బెల్ట్ దుకాణంలో అమ్మకానికి 10 మద్యం బాటిళ్ల తరలిస్తున్న ఓ వ్యక్తిని లక్ష్మీపురం కూడలి వద్ద అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

సెపక్ తక్రా రాష్ట్ర జట్టుకు శ్వేతాశ్రీ

సబ్బవరం: మండలంలోని ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి నునబర్తి శ్వేతాశ్రీ జాతీయ జూనియర్ సెపక్‌తక్రా చాంపియన్ షిప్-2025లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 11, 12 తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో నిర్వహించిన 29వ ఏపీ జూనియర్ అంతర్ జిల్లాల సెపక్ తక్రా పోటీల్లో అనకాపల్లి జట్టుకు ప్రాతినిధ్యం వహించి, అద్భుత ప్రతిభ కనబరిచింది. దీంతో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికై జాతీయ పోటీల్లో పాల్గొననుంది. ఈ పోటీలు నవంబర్ 27 నుంచి డిసెంబర్ 2 వరకూ పంజాబ్‌లో జరగనున్నాయి. ప్రిన్సిపాల్ సుధీర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్ అభినందించారు.